పిఎం యోగా అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్ర ప్రభుత్వ, ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా ప్రధానమంత్రి యోగా అవార్డ్స్-2025 కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, ప్రచారానికి అత్యుత్తమ సహకారం అందించిన వారు, యోగా అభివృద్ధికి విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. https://innovateindia.mygov.in/pm-yogaawards-2025 వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేయాలని సూచించారు.

డిఎస్‌సిపై రేకెత్తిన ఆశలు

- వచ్చే నెలలో నోటిఫికేషన్
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు ప్రకటన
- ఖాళీల వివరాలపై అధికారులు కసరత్తు
- సాధనకు ఉపక్రమిస్తున్న నిరుద్యోగులు

ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ఎట్టకేలకు ఈనెల 25వ తేదీన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోట డిఎస్‌సి (జిల్లా ఎంపిక కమిటీ) ప్రకటన రావడంతో నిరుద్యోగుల్లో మరోసారి ఆశలు రేకెత్తుతున్నాయి. ఇదిగో అదిగో అంటూ కొద్ది నెలలుగా ప్రభుత్వం నిరుద్యోగ ఉపాధ్యాయులను ఊరిస్తున్న ప్రభుత్వం ఏప్రిల్ నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధం కావడంతో నిరుద్యోగులు సాధనకు మరింత పదును పెడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే డిఎస్‌సిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన సంగతి తెలిసిందే. పలుమార్లు వాయిదాలు వేస్తుండడంతో నిరుద్యోగుల్లో క్రమేణా ఆశలు సన్నగిల్లాయి. ఇప్పుడు స్వయంగా సిఎం ప్రకటించడంతో ఉత్సాహంతో సాధనకు ఉపక్రమిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాధన సాగిస్తున్న డిఎస్‌సి అభ్యర్థులు

జిల్లాలో 14 బిఇడి కళాశాలలు ఉన్నాయి. కోర్సు రెండేళ్ల కాలపరిమితి కావడంతో ప్రతి రెండేళ్లకు సుమారు 700 నుంచి 800 మంది రిలీవ్ అవుతున్నారు. వీటితోపాటు 16 డిఇడి కళాశాలు ఉన్నాయి. ఒక్కో కళాశాల నుంచి 50 మంది చొప్పున ప్రతి రెండేళ్లకు 800 మంది రిలీవ్ అవుతున్నారు. వీరు కాకుండా ఇప్పటికే బిఇడి, డిఇడి కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాలు రాని వారు వేలాది మంది ఉన్నారు. టిడిపి హయాంలో అక్టోబర్ 25, 2018న చివరిసారిగా నోటిఫికేషన్ వెలువడింది. ఆ తర్వాత ఉద్యోగ నియామకాలు జరగలేదు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో 2023లో డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ ఏడాది పాటు ఊరించి 2024 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రభుత్వం, అధికారులు అంతా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నం కావడంతో ఆ నోటిఫికేషన్ కథ ముగిసింది. మొత్తమ్మీద ఏడేళ్లుగా ఉద్యోగాల భర్తీ జరగలేదు. దీంతో వేలాది మంది నోటిఫికేషన్ కోసం ఆత్రంగా చూస్తున్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని ప్రభుత్వం చెప్తుండడంతో, జిల్లాలో ఖాళీలపై అధికారులు వివరాలను సేకరిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పంపిన నివేదిక ఆధారంగా నోటిఫికేషన్‌లో జిల్లాలో ఖాళీల వివరాలను పొందుపర్చనున్నారు.

నిరుద్యోగుల్లో ఉత్కంఠ

డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఎన్ని పోస్టులు ఉంటాయనే ఉత్కంఠ నిరుద్యోగుల్లో నెలకొంది. అధికారులు కూడా దీనిపై స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. వివరాలు సేకరిస్తున్నామని చెప్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రెండేళ్ల కిందట జిల్లాలో ఉన్న 712 ఖాళీలు ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్‌లో 527 ఖాళీలు ఉన్నట్లు పొందుపరిచారు. అందులో ఎస్‌జిటి 341 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 106, భాషా పండితులు 42 పోస్టులు ఇలా రకరకాల కేటగిరీలతో పాటు పలు యాజమాన్యాల కింద నడుస్తున్న పాఠశాలల్లో ఖాళీల వివరాలనూ పొందుపరిచారు. వివరాలు గుర్తించి రెండేళ్లు గడిచిపోవడంతో ఇందులో చాలా మార్పులు, చేర్పులు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పాఠశాల విలీనం, సర్దుబాటు వంటి ప్రక్రియల నేపథ్యంలో పోస్టుల సంఖ్య తగ్గే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద జిల్లాలో 450 నుంచి 500 వరకు ఖాళీలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

సాధనకు ఉపక్రమిస్తున్న నిరుద్యోగులు

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగులు ఆశించారు. అంతా అనుకున్నట్లుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేసి మరింత ఆశలు రేపారు. జూన్‌లో సంతకం చేయడంతో ఆగస్టు, సెప్టెంబరులోనైనా నోటిఫికేషన్ వస్తుందని ఆశించారు. ఇదిగో అదిగో నోటిఫికేషన్ అంటూ ప్రభుత్వం వాయిదా వేయడంతో వారిలో ఆశలు సన్నగిల్లాయి. డిఎస్‌సి ప్రిపరేషన్‌పై పెద్దగా ఆసక్తి చూపలేదు. ప్రభుత్వం వచ్చే నెల నోటిఫికేషన్ విడుదల చేస్తుందనే వార్తలతో మళ్లీ వారంతా సాధనకు ఉపక్రమించారు. మరికొంతమంది కృష్ణా జిల్లా అవనిగడ్డలోని డిఎస్‌సి శిక్షణ కేంద్రానికి సైతం పయనమయ్యేందుకు సిద్ధమవుతున్నారు. కొంతమంది నిరుద్యోగులు ఇళ్ల వద్ద, గ్రంథాలయాల వద్ద డిఎస్‌సి కోసం సాధన సాగిస్తున్నారు. డిఎస్‌సి కోసం ఎదురుచూస్తున్న వారిలో ప్రయివేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారు వేలాది మంది ఉన్నారు. ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వస్తుండడం, ఈనెల 23 నుంచి వేసవి సెలవులు కావడంతో పూర్తిస్థాయిలో సాధన సాగించి ఉద్యోగాన్ని ఒడిసిపట్టాలని భావిస్తున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తేజేశ్వరరావు తదితరులు

విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్హతలను బట్టి అర్హులైన విఆర్‌ఎలకు జిల్లా యంత్రాంగం విఆర్‌ఒలుగా, అటెండర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తిలు డిమాండ్ చేశారు.. విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు, రాత్రి పూట విధులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఏప్రిల్ 5న విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో విఆర్‌ఎ రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విఆర్‌ఎలకు తెలంగాణాలో అమలవుతున్న విధంగా పేస్కేల్ అమలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న విఆర్‌ఒ, అటెండర్, వాచ్‌మెన్లు, రికార్డు అసిస్టెంట్లు, డ్రైవర్ల పోస్టుల్లో అర్హులైన విఆర్‌ఎలను నియమించాలన్నారు. నామినీలను విఆర్‌ఎలను గుర్తించాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జీతాలు పెంచాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారని అన్నారు. ఆ సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాగానే విఆర్‌ఎల జీతాలను రూ.15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, ఆ హామీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు రాకపోవడంతో కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు కలెక్టరేట్‌లోని జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమావేశంలో విఆర్‌ఎల సంఘం జిల్లా నాయకులు ఎన్.సీతప్పడు, డి.అప్పారావు, కె.పురుషోత్తం, బి.రాములమ్మ, మీనాక్షి, రాజారావు, లోకనాథం, శంకర్, బొమ్మాళి, వెంకటరమణ, రామ్మూర్తి, లక్ష్మణరావు, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు ధీటుగా డిసిసిబి

ప్రజాశక్తి - గుజరాతీపేట

మాట్లాడుతున్న సత్యనారాయణ

వాణిజ్య బ్యాంకులకు ధీటుగా శ్రీకాకుళం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) పనిచేస్తోందని ఆ బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి దత్తి సత్యనారాయణ తెలిపారు. నగరంలోని డిసిసిబి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని సహకార బ్యాంకులన్నీ శతశాతం కంప్యూటరీకరణ పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 42 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలన్నీ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కంప్యూటరీకరణ చేశామని, దీనివల్ల అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శక సేవలందించేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాలో రూ.650 కోట్ల పంట రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అన్నిరకాల రుణాలు కేంద్ర సహకార బ్యాంకు ద్వారా మంజూరు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి ధీటుగా వ్యవసాయేతర రంగాలకూ రుణాలు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఒక మోడల్ బ్యాంకుగా కేంద్ర సహకార బ్యాంకును తయారు చేయడం తమ ప్రథమ కర్తవ్యమన్నారు. తొలుత రాష్ట్ర సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు డిసిసిబి సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో డిసిసిబి డిప్యూటీ జనరల్ మేనేజర్ వరప్రసాద్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రూ.76 కోట్లతో ఎంఐజి లేఅవుట్

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - పలాస

మండలంలోని బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో 152 ఎకరాల్లో రూ.76 కోట్ల వ్యయంతో ఎంఐజి లేఅవుట్‌లో 1700 ప్లాట్ల నిర్మాణం చేపడతామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బొడ్డపాడు రెవెన్యూ పరిధిలోని ఎంఐజి లేఅవుట్‌ను రెవెన్యూ, సుడా, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. లేఅవుట్‌లో చేపడుతున్న పనులు, భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్‌లో 16 సెంట్లకు సంబంధించి భూ సమస్య ఉందని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే వాటిని పరిష్కరించాలని తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తిని ఆదేశించారు. లేఅవుట్‌లో గుంతలు పూడ్చేందుకు కిడ్నీ ఆస్పత్రి సమీపంలోని కంకర తవ్వి లేఅవుట్‌లో వేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని, అందుకు ఎటువంటి ఇబ్బందులు పెట్టవద్దని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ లేఅవుట్‌లో 152 ఎకరాలను రూ.22 కోట్లకు రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. లేఅవుట్‌లో 80 అడుగుల వెడల్పులో తారు రోడ్లు, 40 అడుగుల వెడల్పులో సిసి రోడ్లు, భూగర్భ కాలువలు, ఓపెన్ మురుగు కాలువలు, పూర్తిస్థాయిలో తాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. లేఅవుట్‌లో నాలుగు పార్కులు, రెండు ఆట స్థలాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సెంటర్ లైటింగ్, కాలువల ద్వారా వస్తున్న వృథా నీటిని రీసైక్లింగ్ చేసి ప్లాంటేషన్‌కు ఉపయోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్, పబ్లిక్ హెల్త్ ఇఇ సుగుణాకర్, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్, ఆర్‌ఐ ఖగేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఫర్మాన్‌ఖాన్

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

డిఇఒను తప్పించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యను తక్షణమే విధుల నుంచి తొలగించి, విద్యాశాఖ అక్రమాలపై విచారణ చేయించాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షల మాస్ కాపీయింగ్ పేరుతో 14 మంది ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్లను ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యాన నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. జిల్లావ్యాప్తంగా పలు మండలాల నుంచి పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరయ్యారు. డిఇఒ ఉద్దేశపూర్వకంగా ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో పది పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగిందని ఐదుగురు విద్యార్థులను డిబార్ చేయడమే కాకుండా అందుకు బాధ్యులుగా పేర్కొంటూ పరీక్ష విధుల్లో ఉన్న, లేని 14 మందిని ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెట్టడం కక్షసాధింపు చర్యగానే ఉందని ఉమ్మడి వేదిక నాయకులు చౌదరి రవీంద్ర, మజ్జి మదన్‌మోహన్, తంగి మురళీమోహన్ తదితరులు అన్నారు. తక్షణమే సస్పెన్షన్లు, క్రిమినల్ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష పరిధిలో తిరుమల చైతన్య అక్రమాలపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. తనిఖీ బృందం పేరుతో విద్యార్థులను వేధింపులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా సమయాన్ని కాలరాస్తూ విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసిన వారిపై చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం తక్షణమే సస్పెన్షన్లను రద్దు చేయాలని, వారిపై విధించిన క్రిమినల్ కేసులను రద్దు చేయాలని, లేకుంటే ఏప్రిల్ మూడో తేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన పదోతరగతి స్పాట్ వాల్యూయేషన్‌ను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎస్.కిషోర్ కుమార్, గొంటి గిరిధర్, పొందూరు అప్పారావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, డిటిఎఫ్ నాయకులు పేడాడ కృష్ణారావు, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, ఎపిటిఎఫ్ నాయకులు బల్లెడ రవి, ఎస్‌టియు నాయకులు ఎస్.వి రమణమూర్తి, జి.రమణ, ఇతర సంఘాల నాయకులు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఇఫ్తార్ విందు

జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఆర్.ఎస్ జాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఈ నెల 28న రంజాన్ సందర్భంగా ప్రత్యేక ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్టు మైనార్టీ అధికారి ఆర్‌ఎస్ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అరసవల్లి మిల్లుజంక్షన్ వద్ద గల ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో సాయంత్రం 6 గంటలకు ఈవిందు జరుగుతుందని తెలిపారు. ముస్లిం మైనారిటీ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, టెక్కలి వారి దివ్య సముఖమునకు

IP. 1/2025

Between:-

Jami Saran Kumar, S/o.Late Venkataramana, aged about 29 years, R/o.Door No.12-47, Railway station road, Tekkali village and mandal, Srikakulam district, Aadhaar No.644571127751 ...PETITIONER

And:-

1. Jeeru Sobha Rani, D/o.Jeeru Rao, aged about 28 years, R/o.Door No.4-5, R/o.Meliyaputti village and mandal, Srikakulam district, Cell: 9110709022.

2. Chinni Sridhar naidu, S/o.Chinni Naidu, aged about 32 years, building contractor, R/o.Door No.42-2, ChinnaNarayanapuram village, Tekkali mandal, Srikakulam district, Cell: 6383791006.

3. Sasanapuri Manivarma, S/o.LavaKumar, aged about 29 years, Private job in Tech Mahindra(work from home), R/o.Door no.14-3, Opposite to Killipalem temple, Cheri veedhi, Tekkali village and mandal, Srikakulam district, Cell: 7842957459.

4. Rokkam Anil, S/o.Rokkam Raja, aged about 35 years, finance business, R/o.Door No.33-5, back side of Adarsh model School, Srinivasa nagar, Tekkali village and mandal, Srikakulam district, Cell: 9652666903.

5. Mudimanchi Lokesh, S/o.Mudimanchi Tatarao, aged about 32 years, Collection executive in Shriram Chits, R/o.Door No.74-41, Ravivalasa village, Tekkali mandal, Srikakulam district, Cell: 9939481676.

6. Pondreti DamodaraRao, S/o.Pondreti Pentayya, aged about 28 years, building construction labor contractor, R/o.Door No.71-3, near railway station, SyamSundar colony,Tekkali village and mandal, Srikakulam district, Cell: 8179014929.

7. Patnana Santosh Kumar, S/o.Patnana Hari, aged about 32 years, employee in Reliance Jio store, R/o.Door no.55-8, near railway station, SyamSundar colony,Tekkali village and mandal, Srikakulam district, Cell: 9502020350.

8. Talasu Ramesh, S/o.Talasu Rajarao, aged about 40 years, finance business, R/o.Door No.77-5, Palasa village and mandal, Srikakulam district, Cell: 9666545348.

9. Golugorri Venkata Manikanta Reddy, S/o.Golugorri Reddy, aged about 40 years, finance business, R/o.Door no.8-86, Tekkali village and mandal, Srikakulam district, Cell: 8790748355

10. Dwarampudi Babi, S/o.Dwarampudi Uma, aged about 45 years, finance business, R/o.back side of Govt degree college, Tekkali village and mandal, Srikakulam district, Cell: 9849237996

11. Ladi Anil Kumar, S/o Ladi Narasimhamurthy, aged about 55 years, proprietor of Anil Electronics, R/o.Door No.4-3, Kacheri veedhi, Tekkali village and mandal, Srikakulam district, Cell: 9440149811.

12. Garlapati Praveen Kumar, S/o.Garlapati Kumar, aged about 60 years, Electrical business, R/o.Door no.44-75, Bhagatsingh road, Satyanarayanapuram village, Vijayawada mandal and district, Cell: 9866343435

...RESPONDENTS

జనరల్ నోటీసు

పై నెంబరు గల పిటిషన్ లో పిటిషనర్ తనను ఇన్ సాల్వెంట్ పర్సన్‌గా డిక్లేర్ చెయ్యమని దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో ఎవరికైన ఎట్టి అభ్యంతరములున్నచో **తే 28-03-2025 ఉ॥ 10:30 ని॥ లకు** పైన తెలిపిన కోర్టు యందు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తెలియజేయవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

డి.టి. మణి చందన్
అడ్వకేట్, ఫరీదుపేట, ఎచ్చర్ల,
శ్రీకాకుళం, సెల్: 8919146438.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - అరసవల్లి

వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

నియోజకవర్గంలోని ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావడం వల్ల సమస్యను పరిష్కరించేందుకు వీలవుతోందని, సమస్యను నేరుగా పరిశీలించి పరిష్కారం చూపుతున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో గల తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజెప్పేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉందని, మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు నేరుగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు. దీనికితోడు ప్రభుత్వం పౌర సేవల కోసం ప్రత్యేకంగా వాట్సాప్ నంబరు ఇచ్చి సమస్యలను నేరుగా చెప్పుకునే అవకాశం కల్పించిందన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి అధికారులతో చర్చిస్తున్నానని చెప్పారు. పిజిపేట వద్ద సముద్రపు కోతనుంచి తీరాన్ని రక్షించేందుకు ఉన్నత స్థాయి అధికారులతో చర్చించినట్లు తెలిపారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ

డ్వామా పీడీ సుధాకరరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న పీడీ సుధాకరరావు

నిష్పక్షపాతంగా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నామని, తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకరరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 17వ విడ సామజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించేందుకు చేపడుతున్న పనులు అర్హులందరికీ కల్పించాలన్నారు. ఎవరైనా అవతవకలు పాల్పడినట్లు సామాజిక తనిఖీలో రుజువైతే వారి నుంచి తగిన రుసుం, రికవరీ చేస్తామని హెచ్చరించారు. రూ.33.54 కోట్లు కూలి చెల్లింపు, రూ.4.32 కోట్లు మెటీరియల్ ఖర్చు అయ్యిందని అన్నారు. రాష్ట్రం నుంచి వచ్చిన ఎస్‌ఆర్‌పి, ఆరుగురు డిఆర్‌పిలు, 12 మంది విఎస్‌ఎతో 15 రోజుల పాటు గ్రామంలో నిర్వహించిన, గుర్తించిన పనులు, అభియోగాలు చదివి వినిపించారు. గ్రామంలో వేసిన మొక్కలు చనిపోయినట్టు, కొన్ని గ్రామాల్లో మస్తర్లపై కొన్ని సంతకాలు లేనట్టు గుర్తించారు. సుమారు పది పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లపై, టెక్నికల్ అసిస్టెంట్లపై రూ.1,26,000 రికవరీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రావి స్వరూపారాణి, ఎపిడిలు శైలజ, లోకేష్, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఎఇ అప్పన్న, ఎపిఒ శ్రీనివాసనాయుడు, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, పీసిని హరికృష్ణ పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సికి ఆన్‌లైన్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం మెగా డిఎస్‌సి నిర్వహించేందుకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యంలో బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన బిసి అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు సర్కిల్ డైరెక్టర్ ఇ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షలో అర్హత సాధించిన జిల్లావాసులకు మాత్రమే శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బిసితో పాటు ఇబిసి అభ్యర్థుల నుంచి మెగా డిఎస్‌సి పరీక్ష ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. టెట్ పరీక్షల మార్కుల ఆధారంగా ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నగరంలోని 80 అడుగుల రోడ్డు, బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఈనెల 31వ తేదీ లోగా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7382975679, 9295653489 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అవార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

మెప్మాకు అంతర్జాతీయ ఖ్యాతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈ-కామర్స్ ద్వారా ఆన్‌లైన్ వ్యాపారం నిర్వహించి మెప్మా విభాగం అంతర్జాతీయ ఖ్యాతిని పొందిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మూడు అంతర్జాతీయ రివార్డులను ఆయన చేతుల మీదుగా సభ్యులకు బుధవారం అందజేశారు. గిన్నిస్ బుక్ ఆఫ్ ది వరల్డ్ రికార్డుతో పాటు 20వేల మందికి ఈ-కామర్స్ ద్వారా ఆన్‌లైన్ వ్యాపారం నిర్వహించి రికార్డు సాధించారని తెలిపారు. ఒక్కరోజు కోటి 20 లక్షల మందికి ఆన్‌లైన్ ద్వారా రూ.3.50 కోట్ల నగదు బదిలీ చేసి వ్యాపారం సాగించి మరో అవార్డును సొంతం చేసుకున్నారని చెప్పారు. మహిళలు సాధించలేనిదంటూ ఉండదని, ఈ అవార్డులతో మరోమారు తమ సత్తాను నిరూపించుకున్నారని ప్రశంసించారు.

ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

ఉద్దానం ప్రాజెక్టు పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి సమీపంలోని ఉద్దానం తాగునీటి ప్రాజెక్టును బుధవారం టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నుంచి బిటి రోడ్డు వరకు ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఏకలవ్య మోడల్ పాఠశాలను పరిశీలించి ఇక్కడ చేపడుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ప్రాజెక్టు నుంచి పాఠశాలకు ఉద్దానం ప్రాజెక్టు తాగునీటి సరఫరా చేయాలని ప్రిన్సిపాల్ రాధాకృష్ణ ఆర్‌డిఒకు విన్నవించారు. నీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని వంశధార డిఇ శాంతిలతను ఆర్‌డిఒ ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బడే పాపారావు సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఆవరణ పరిశుభ్రం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- గుజరాతీపేట

సున్నం వేయిస్తున్న అధికారులు

ఆర్‌టిసి బస్టాండ్‌లో అపరిశుభ్రత అనే శీర్షికతో ఇటీవల 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురించడంతో ఆర్‌టిసి అధికారులు స్పందించారు. ప్రయాణికుల ఆరోగ్యం, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే మరుగుదొడ్లను శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రం చేసి రోజువారీ శుభ్రత పనులను పర్యవేక్షిస్తున్నారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవు తున్నారు. చెత్తచెదారం, దుర్వాసన వలన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనడంపై కథనం వెలువడిన వెంటనే డిపో మేనేజర్ ఆదేశాల మేరకు మరుగుదొడ్ల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. గోడలకు సున్నాలు వేయించి, చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచారు. నూతనంగా మారిన పరిసరాలను చూసిన ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

గృహ నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి- పోలాకి

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కత్తిరివానిపేటలో క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ గృహ నిర్మాణ పనుల్లో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అర్హులందరూ ఇళ్లు కలిగి ఉండాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ, నాలుగు మండలాలు ఎఇలు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి భాయ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని మారుతీనగర్ ప్రాంతానికి చెందిన న్యాయవాది ఇజ్రాయిల్‌ను అతి దారుణంగా దస్తగిరి అనే వ్యక్తి కత్తులతో దాడి చేసి హత్య చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ హత్యకు నిరసనగా ఒకరోజు కోర్టు విధులను బహిష్కరిస్తూ కోర్టు ఆవరణలో న్యాయవాదులందరూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు అధికంగా జరుగుతున్నాయని, ప్రభుత్వాలు తక్షణమే స్పందించి న్యాయవాదులకు రక్షణ కవచంగా ఒక చట్టాన్ని తీసుకురావాలని ఆమె కోరారు. ఈ నిరసనలో న్యాయవాదులు బొడ్డేపల్లి మోహనరావు, పివి నరసింహం, సాదు ధనంజయరావు, తమ్మినేని అన్నంనాయుడు, వాడవలస రాజేశ్వరరావు, సనపల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

30న పరుగు పందెం పోటీలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొరివంకలో ఉగాదిని పురస్కరించుకుని ఈ నెల 30న నియోజకవర్గస్థాయి పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు మాత్రమే నిర్వహిస్తున్న ఈ పోటీలో 3 కిలోమీటర్లు పాల్గొనేవారి వయసు 15 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. వయసు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు తప్పనిసరని తెలిపారు. ఎటువంటి ప్రవేశ రుసుం లేని ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.3,333, షీల్డ్, ద్వితీయ బహుమతిగా రూ.2,222, షీల్డ్, తృతీయ బహుమతిగా రూ.1,111, షీల్డ్ అందిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి కలిగిన యువకులు ఈ 8465896439, 6305259235, 9515454770, 9701319090, 7993693592 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కుక్కల దాడిలో జింక మృతి

ఇచ్ఛాపురం: మండలంలోని రత్తకన్న వద్ద బుధవారం కుక్కల దాడిలో జింక మృతి చెందింది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు కాశీబుగ్గ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణనాయుడు ఆదేశాల మేరకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాము, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు మృతి చెందిన జింకను పరిశీలించారు. అనంతరం బెల్లుపడ వెటర్నరీ సిబ్బంది ఆధ్వర్యాన పోస్టుమార్టం నిర్వహించి జింకను దహనం చేశారు.

మృతి చెందిన జింక

తాగునీటి అవస్థలు

- కానరాని చలివేంద్రాలు
- మండుతున్న ఎండలు
- పనులపై పట్టణ కేంద్రాలకు, బస్టాండ్‌కు వచ్చే వారికి నీళ్లు కరువు
- చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదులు

ప్రజాశక్తి- గుజరాతీపేట

జిల్లాలో 39 డిగ్రీల నుంచి 42.8 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మండుతున్న ఎండలకు తాగేందుకు గుక్కెడు నీళ్లు లేక పట్టణానికి వచ్చే ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. డబ్బులు పెట్టి కొంటే తప్ప చుక్కనీరు దొరకని దుస్థితి నెలకొంది. మున్సిపాలిటీల్లో వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు కలెక్టర్ మున్సిపల్ అధికారులకు ఆదేశించినా అధికారులు మాత్రం ఇప్పటికీ తాగునీటి సౌకర్యం కల్పించడంలో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు.

బస్టాండ్, ఆస్పత్రుల్లో దొరకని నీరు

జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం లేక ప్రయాణికులతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్లలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ఆర్‌టిసి అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు, ఆర్‌టిసి సిబ్బంది కోసం దాతలు ఇచ్చిన ఆర్‌ఒ ప్లాంట్లు కూడా మెయింటెనెన్స్ చేయని దుస్థితిపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో మంచినీళ్లు కావాలంటే కొనుక్కోవాల్సిందే. అరసవల్లి సూర్య నారాయణ స్వామి దేవస్థానానికి దాతలు ఇచ్చిన కూల్ వాటర్ ఫ్రిజ్‌లను కూడా ఉపయోగించడం లేదు.

అలాగే రిమ్స్ జనరల్ ఆస్పత్రిలో తాగునీటి కోసం పేషెంట్లు ఇబ్బంది పడుతున్నారు. నీళ్లు కావాలంటే సెకండ్ ఫ్లోర్ నుంచి పేషెంట్లు, వారి సహాయకులు గ్రౌండ్ ఫ్లోర్ వరకు నడుచుకుంటూ రావాల్సిందే. నూతనంగా ఏర్పాటు చేసిన మాతా శిశుసంక్షేమ కేంద్రంలోనూ తాగునీటికి తిప్పలు తప్పడం లేదు.

కనిపించని చలివేంద్రాలు

పట్టణ కేంద్రాలకు వివిధ పనులపై చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజూ వేల సంఖ్యలో ప్రజలు వచ్చిపోతుంటారు. అటు బస్టాండ్, ఆస్పత్రుల్లోనూ సరిగా నీళ్లలేక ఇటు ఎండాకాలంలో ఏర్పాటు చేసే చలివేంద్రాలు లేక తాగునీటికి నానా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఎండలు మండుతున్నా అధికారులు మాత్రం ఇప్పటి వరకు తాగునీటి ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడం సరికాదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పట్టణ కేంద్రాల్లో మున్సిపాలిటీ పరిధిలో డే అండ్ నైట్, ఏడురోడ్లు కూడలి, పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మధులత

విద్యార్థికి అభినందనలు

టెక్కలి : స్థానిక ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న గౌడ వేదవ్యాస్ జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ మళ్లా మధులత బుదవారం అభినందించారు. వెన్నెలవలస జవహర్ నవోదయకు ఎంపిక కావడంలో విద్యార్థి ప్రతిభను అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 33/11 కె.వి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి ఎఫ్‌సిఐ / టౌన్ - 1 ఫీడర్ పరిధిలోని మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగించుట కారణంగా ఈ నెల 28న విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పంతుల పేట, సొట్టవానిపేట, ఎఫ్‌సిఐ, కె.మన్నయ్యపేట, టి.మన్నయ్య పేట, తురకపేట, చింతాడ, నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

నేడు ప్రజావేదిక

టెక్కలి రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో గురువారం ఉపాధి హామీ సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎపిఒ బి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు నిర్వహించిన పనులపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు ప్రజావేదిక

లావేరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 28న ఉపాధిహామీ పథకం 2023 -24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన వివిధ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పి.వెంకటరాజు, ఎపిఒ రెడ్డి సత్యవతిలు తెలిపారు. ఈ కార్యక్రమనికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది, ప్రజలు హాజరు కావాలని కోరారు.

వేలంపాట ఖరారు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎట్టకేలకు మూడోసారి నిర్వహించిన మున్సిపల్ వేలం పాట కొలిక్కి వచ్చింది. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన 025-26 ఆర్థిక సంవత్సరానికి వీధిగుత్త, డైలీ మార్కెట్ ఆశీలు, కమేళా, పాత పేపర్లకు సంబంధించి వేలం పాటలు బుధవారం నిర్వహించారు. డైలీ మార్కెట్, వీధిగుత్త ఆశీలు రూ.24.13 లక్షలతో పాటు 18 శాతం జిఎస్‌టి రూ.4,34,340తో కలిపి పాట రూ.28,47,340, కమేళా రూ.1,63,500లతో పాటు 18 శాతం జిఎస్‌టి రూ.29430తో రూ.1,92,930కి పాటదారుడు కె.రాజు హెచ్చు పాటదారుడుగా నిలిచాడు. పాతపేపర్లు రూ5,500కు, కొబ్బరిచెట్ల ఫలసాయం రూ.4,100కు రాజు హెచ్చు పాటదారుడుగా నిలిచాడు. ఈ నెల ఆఖరిలో నిర్వహించే మున్సిపల్ సాధారణ సమావేశంలో ఏజెండాలో పెట్టి కౌన్సిల్ ఆమోదించిన తరువాత పాట ఖాయం చేస్తామని కమిషనర్ తెలిపారు.

వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్ రమేష్

ఉద్యోగోన్నతులపై పునరాలోచించాలి

ప్రజాశక్తి- కవిటి

గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతులు (ఎఎస్ఒ)కోసం ఇటీవల కాలంలో ఏర్పాటు చేసిన కమిటీ అనివార్య కారణాలవల్ల రద్దు చేశారని, డిజిటల్ అసిస్టెంట్ల పనితీరుని దృష్టిలో ఉంచుకొని తిరిగి ఆ నిర్ణయంపై పునరాలోచించి తమకు న్యాయం చేయాలని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు రామయ్యపుట్టుగలోని విప్ క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమలో 80 శాతం మంది బిటెక్, ఎంటెక్, పిహెచ్‌డి పూర్తిచేసి అపారమైన సాంకేతిక పరిజ్ఞానం కలిగినవారు ఉన్నారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తమకు టెక్నికల్ స్థాయిలో ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. విప్ మాట్లాడుతూ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ సభ్యులు కె.అప్పన్న, వెంకటరమణ, పొల్లాయి అశోక్, జవహర్‌లాల్, పి.జగదీష్, లొల్ల విజయ్, డి.లోకేష్, ఎం.నవీనా, నీరజ, డి.నవీన్, జయదేవ్, శేషారావు, బాలకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

కవిటి : వినతిపత్రం అందిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

ఇచ్ఛాపురం : డిజిటల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతిపై పునరాలోచన చేయాలని డిజిటల్ అసిస్టెంట్లు యాదవ్ కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పొల్లాయి అశోక్, పి.జగదీష్, లొల్ల విజయ్, డి.లోకేష్, నీరజన, డి.నవీన్, జయదేవ్, శేషారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

జగన్నాథం నగర్‌లో కాలువలు నిర్మించాలి

కమిషనర్‌కు పట్టణ పౌర సేవా సంఘం వినతి

వినతిపత్రం అందజేస్తున్న గోవర్ధనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న విలీన చాపురం పంచాయతీ జగన్నాధం నగర్ కాలనీ అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి గురైందని, ఈ ప్రాంతంలో నివాసముంటున్న ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని పట్టణ పౌరసేవా సంఘం కన్వీనర్ మాతల గోవర్ధనరావు పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ప్రసాదరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు రెగ్యులర్‌గా ఇంటి పన్నులు, కొళాయిపన్నులు చెల్లిస్తున్నా నేటికీ మురుగునీటి కాల్వలను నిర్మించలేదన్నారు. దీనివల్ల ఖాళీ ప్రదేశాల్లో మురుగు నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయని వివరించారు. పారిశుధ్య నిర్వహణ సరిగా లేక ప్రజలు ప్రాణాంతక వ్యాధులైన టైఫాయిడ్, మలేరియా, డెంగీ బారిన పడుతున్నారని వివరించారు. దీనికితోడు మురుగునీరు చేరడం వల్ల వృధానీటిలో ముళ్లపొదలు పెరిగి పాములు సంచరిస్తున్నాయని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు నేరుగా సందర్శించాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు రామారావు, విజయ్ కుమార్, సునీత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

టిడిపి కార్యాలయంలో గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ (గ్లో) ఆధ్వర్యాన జిల్లా కిమ్స్ ఆస్పత్రి వైద్యులు బుధవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయించడానికి తాము స్థాపించిన గ్లో సంస్థ ద్వారా సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఏటా ఇటువంటి వైద్య శిబిరాలను నిర్వహించి కార్పొరేట్ వైద్యం అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు 600 మందికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో అత్యవసరంగా 50 మందికి వైద్య సౌకర్యం కల్పించాలని నిర్ధారించారు. 30 మందికి స్క్రీనింగ్ టెస్టు చేశారు. కేన్సర్, ఆర్థో, ఇఎన్‌టి, నేత్ర వైద్యం, న్యూరాలజీ, గుండె పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమాన్ని గ్లో సంస్థ ప్రధాన కార్యదర్శి, టిడిపి నియోజకవర్గ యార్లగడ్డ వెంకన్నచౌదిరి పర్యవేక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎం.వరేంద్ర, టంకాల రవిశంకర్ గుప్తా మల్లా శ్రీనివాస్, ఎ.రామకృష్ణ, కొత్త సత్యం, జోగ మల్లి, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

వైద్య బృందంతో ఎమ్మెల్యే గౌతు శిరీష

యువ పార్లమెంట్ పోటీలకు వర్శిటీ విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న వైస్ ఛాన్సలర్ రజని

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎస్.సాయి ప్రదీప్ (ఇసిఇ విభాగం, డా. బిఆర్ఎయు) జి. రాజరాజేశ్వరి (కాకినాడ ఆదిత్య కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటరీ)లు జాతీయ యువ పార్లమెంట్-2025 పోటీలకు రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఇటీవల విశాఖలోని గీతం విశ్వవిద్యాలయంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన జోనల్‌స్థాయి పోటీల్లో వీరిద్దరు పాల్గొని ప్రతిభ కనపరిచారు. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌ను జాతీయస్థాయిలో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో అర్హత సాధించేందుకు జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు ముందుగా నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన పలు కళాశాలలు, వర్శిటీల విద్యార్థులు పాల్గొనగా డా.బిఆర్ఎయు తరుపున వీరిద్దరు రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరగనున్నాయి. ఈ విద్యార్థులకు బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని బుధవారం అభినందనలు తెలిపి జాతీయస్థాయి వరకూ ప్రతిభ కనపరచాలని సూచించారు. వర్శిటీ ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ డా.డి.వనజ, ఎల్.మోహనరావు, టి.భవాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి అచ్చెన్న జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర రాజకీయాల్లో గుర్తింపు పొందిన నాయకులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడని, రానున్న రోజుల్లో మరిన్ని పదవులను అధిరోహించి విజయాలను అందు కోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం నగరంలోని మంత్రి అచ్చెన్నాయుడి జన్మదిన వేడుకలను ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంతో పాటు పేదలకు అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన కేకు కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. అంతకు ముందు ఏడురోడ్ల కూడలిలో ఉన్న స్వర్గీయ ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాండ్రంకి శంకర్, అందవరపు సంతోష్, అంబటి లక్ష్మీరాజ్యం, ఇప్పిలి తిరుమలరావు, పిఎంజె బాబు, ఉంగటి రమణ, మాదారపు వెంకటేష్, కవ్వాడి సుశీల, బాలామణి, విభూతి సూరిబాబు, చిట్టి నాగభూషణరావు, శీర రమణయ్య, రెడ్డి గిరిజా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండల కేంద్రంలో టిడిపి అధ్యక్షులు భాస్కర్ గౌడ్ ఆధ్వర్యాన మంత్రి అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, మాజీ ఎంపిపిలు సలాన మోహనరావు, బైరిసింగి లక్ష్మీనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి సర్పంచ్‌లు, అనపాన రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్తూరు : కేకును కట్ చేస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు : మండల కేంద్రంలో మంత్రి అచ్చెన్నాయుడు పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అగతముడి భైరాగినాయుడు, అగతముడి మాధవరావు, అగతముడి అరుణ కుమార్, మాతల గాంధీ, పడాల లక్ష్మణరావు, గోగుల వరప్రసాద్ నాయుడు, నెల్లి అచ్యుతరావు, లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, మజ్జి వెంకటరావు పాల్గొన్నారు. అలాగే టిడిపి నాయకులు, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, లక్ష్మీనారాయణ నాయుడు, కోయిలాపు సంజీవరావు, దారపు రామకృష్ణ, బోర శ్రీరాములు మంత్రి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

మధు మృతదేహం (ఇన్‌సెట్‌లో మధు)

పెళ్లయిన 50 రోజులకే... రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- పలాస

ఆ యువకుడు ప్రేమ వివాహం చేసుకొని ఆనందంగా దాంపత్య జీవితాన్ని అనుభవించాలని అనుకున్న తరుణంలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు పోయాయి. పెళ్లయిన యాభై రోజులకే మృత్యువాత పడడంతో భార్య కుమారి తనను విడిచి వెళ్లిపోయావా అంటూ రోదించడంతో పలువురిని కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యులు, కాశీబుగ్గ పోలీసులు కథనం మేరకు... కాశీబుగ్గ కోసంగిపురం కూడలి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని గొల్లమాకన్నపల్లికి చెందిన కోరాడ మధు (28) అక్కడికక్కడే మృతి చెందారు. మధు తన సొంత పనులు ముగించుకుని తిరిగి పలాస-మొగిలిపాడు నుంచి స్వగ్రామమైన గొల్లమాకన్నపల్లికు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. కోసంగిపురం కూడలి జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి పడడంతో తీవ్రంగా గాయపడి ప్రమాదస్థలంలోనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మధు, కుమారి ప్రేమించుకున్నారు. తల్లిదండ్రులను ఒప్పించి ఫిబ్రవరి 6న శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురానికి చెందిన కుమారిని పెళ్లి చేసుకున్నాడు. మృతుడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి తండ్రి లింగమూర్తి, తల్లి పాపమ్మ ఉన్నారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలాన్ని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమితం పలాస ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజారావు (ఫైల్)

మండలంలోని బడివానిపేట గ్రామ విఆర్‌ఒ పుట్ట రాజారావు (45) సచివాలయంలో విధులు నిర్వహిస్తుండగా ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చి బుధవారం మృతి చెందాడు. స్థానికులు, సచివాయల సిబ్బంది తెలిపిన వివరాల మేరకు రాజారావు ఉదయం విధులకు హాజరై సాయంత్రం వరకూ సచివాలయంలో ఉన్నాడని, సాయంత్రం 4 గంటల సమయంలో గుండెపోటు రావటంతో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడన్నారు. మృతుడు తండ్రి ఎర్రగన్నెయ్య విఆర్‌ఎగా పనిచేస్తూ మృతిచెందటంతో కుమారుడు రాజారావుకు విఆర్‌ఎగా ఉద్యోగం వచ్చింది. గడిచిన 12 ఏళ్ల నుంచి విఆర్‌ఎగా పనిచేస్తుండగా ఇటీవల ఏడాది క్రితం విఆర్‌ఒగా పదోన్నతి పొంది బడివానిపేట సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన మొదటి భార్య మృతిచెందగా రెండో భార్యగా రజనిని వివాహం చేసుకున్నాడు. రాజారావుకు కుమారులు శశికుమార్, గౌతమ్, కుమార్తె ఐశ్వర్య ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో జవాను మృతి

ప్రతాప్‌రెడ్డి

టెక్కలి రూరల్ : రోడ్డు ప్రమాదంలో స్థానిక చేరివీధికి చెందిన పైల ప్రతాప్ రెడ్డి (38) అనే ఆర్మీ జవాన్ మృతి చెందారు. మృతుడు ఢిల్లీలో జవాన్ విధులు నిర్వహిస్తున్నారు. సెలవులు నిమిత్తం ఇటీవల వచ్చారు. మూడు రోజుల క్రితం రోజుల క్రితం వచ్చారు. మూడు రోజుల క్రితం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతున్న కృష్ణారావు

వృద్ధుడు ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్ : మండలంలోని బొప్పాయిపురం పంచాయతీ చల్లపేటకు చెందిన హనుమంతు కృష్ణారావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళ వారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి అవస్థతకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

మద్యం స్వాధీనం

కవిటి: మండలంలోన ఇద్దివానిపాలెంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో గ్రామానికి చెందిన వంక ఊర్మిళ వద్ద నుంచి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్ సిఐ పి.డి.ప్రసాద్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి విక్రయాలు, వినియోగాలు నివారించేందుకు స్థానికులు సహకరించాలని కోరారు. వీటిని విక్రయించినా, వినియోగించినా టోల్ ఫ్రీ నంబరు 14405కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ

పలాస : స్థానిక సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ఇఎంటిలకు యునైటెడ్ కింగ్డమ్ మాడ్యుల్ అనుగుణంగా శిక్షణ అందించారు. జిల్లా ఎఇఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, ఇఒ జగన్నాథరావులు పర్యవేక్షించారు. ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ తరగతులు నిర్వహించారు. అత్యవసర, పెడియాట్రిక్ ఎమర్జెన్సీ మెడికల్ వైద్య సేవలు వివరించారు. కార్యక్రమంలో 30 మంది ఇఎంటిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణదాస్

త్వరితగతిన మండలస్థాయి కమిటీలు

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వైసిపి అనుబంధ విభాగాలు మండలస్థాయి కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా కమిటీలు అనుబంధ విభాగాలు పూర్తయ్యాయని అన్నారు. నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండలస్థాయి కమిటీల ఏర్పాటుపై దృష్టిసారించాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. టిడిపి కూటమి ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా ప్రతి కార్యకర్తా పనిచేయాలన్నారు. తిలక్ మాట్లాడుతూ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టికి తీసుకెళ్లడం, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, అట్లా రాహుల్ కుమార్, పోలాకి మోహనరావు, ఉప్పాడ తమ్మయ్య, ఎం.దుర్యోధనరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను అడ్డుకున్న సభ్యులు

పోర్టు వాహనాలు అడ్డగింత

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక కొత్తపేట కొండ సమీపంలో బుధవారం పోర్టు వాహనాలను స్థానిక టిప్పర్ల అసోషియేషన్ అధ్యక్షుడు మంచాల కేశవరావు ఆధ్వర్యాన వాహనదారులు అడ్డుకున్నారు. స్థానిక వాహనాలను పోర్టు యాజమాన్యం పక్కన పెట్టి బయట ఎక్కడనుంచో తెచ్చి వాహనాలను వినియోగించి ఇక్కడ గ్రావెల్, ఇసుక రవాణాలు చేస్తున్నాయని వారు ఆందోళన చేశారు. లక్షలాది రూపాయిలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసి ఉంటే మాకు ఉపాధి కల్పించకుండా ఎక్కడ నుంచో వాహనాలు తీసుకువచ్చి బయటవారికి ఉపాధికల్పిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రజాప్రతినిధులకు, పోర్టు యాజమాన్యానికి చెప్పిన పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. ఇప్పటికైన స్థానిక వాహనాలు వినియోగించి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధికల్పించాలని, అప్పటి వరకు గ్రావెల్, ఇసుక రవాణాలను నిలుపుదల చేయాలని అసోసియేసన్ హెచ్చరించింది.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎఒ భాస్కరరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సస్యరక్షణతో పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని వంజంగి, తోటాడ రైతుసేవా కేంద్రంలో రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేరుశెనగ, నువ్వుల పంటలను పరిశీలించి చీడపీడలు, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎం కిసాన్, రైతుల ఆధార్ విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు. పొలాల్లో ఇంకుడు గుంతల ఉపయోగాలను తెలియజేస్తూ అవసరం ఉన్న రైతులు రైతుసేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎన్‌పిఎస్‌ఎస్ అప్లికేషన్ ఉపయోగాలను రైతులకు వివరించారు. ఎరువుల యాజమాన్యం వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ కెటివి రమణమూర్తి, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ జీవనజ్యోతి, రేణుక, రైతులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : మండలంలోని వల్లభరావుపేట పంచాయతీలో వ్యవసాయ అధికారి డి. విజయభాస్కర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆధునిక సాంకేతికతని, విషయ పరిజ్ఞానాన్ని రైతులకు తెలియజేశారు. ఇపంట, ఇకెవైసి పూర్తిచేసి, ఇపంట సోషల్ ఆడిట్ జాబితాని రైతు సేవా కేంద్రంలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఇ పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను కూడా రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరి

కవిటి: ఈ నెల 31లోగా రైతులు ప్రభుత్వం కేటాయించనున్న విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా కలిగి ఉండాలని మండల ఎఒ పిరియా శ్రీదేవి సూచించారు. మండలంలోని బొరివంకలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు గుర్తింపు సంఖ్య కోసం రైతులు తమ వివరాలు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలు నమోదు కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, ఫోను నంబరుతో స్థానిక వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. అంతకముందు రబీ పంట పొలాలు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. వరిలో కొత్త వంగడాలు, డ్రోన్ ఉపయోగం, ఖరీఫ్ సాగు ప్రణాళికలు తదితర అంశాలపై రైతులతో చర్చించారు. కార్యక్రమంలో ఎఇఒ బెందాళం శ్రీకళ్యాణ్, విఎఎ సింహాచలం, ఎపిఎంఐపి సహాయకులు శరణ్య, రైతులు బల్లెడ జయప్రకాష్, బి.తేజేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, బి.రాంబాబు పాల్గొన్నారు.

కవిటి : అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీదేవి

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

యువత ఖాళీగా ఉండకూడదని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రయివేటు ఉద్యోగాలు చేయడం ద్వారా యువతకు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం బ్లూస్టార్, యూనికాం, ఫిజియన్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహించారు. ముఖ్య అతిథి పాల్గొన్న ఆమె మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. జాబ్‌మేళా ద్వారా యువతకు ఉద్యోగ అవకాశంతో పాటు కుటుంబం రోడ్డుపై పడకుండా తల ఎత్తుకుని జీవనం సాగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్‌మేళాకు 72 మంది అభ్యర్థులు పాల్గొనగా, 53 మంది ఉద్యోగానికి ఎంపియ్యారు. అనంతరం వెలుగు అధికారులు ఎమ్మెల్యేకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వెలుగు జెడిఎం ఎస్.రమణమూర్తి, డిపి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ట్రైనర్ కె.కవిత, జెసిఒ ఎల్.నాగేశ్వరరావు, బ్లూస్టార్ హెచ్.ఆర్.రాజు, శ్రీనివాస్ సాహూ, సురేంద్ర సాహూ, స్వర్ణ, ఎంఎంఎస్ అధ్యక్షులు గండుబారికి శాంతమ్మ, కార్యదర్శి పార్వతి, కోశాధికారి త్రివేణి, ఎపిఎం జాంబవతి, టిడిపి నాయకులు పి.విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్లాట్లు

పలాస అభివృద్ధిలో ఎంఐజి లే అవుట్ ఒక భాగమని, ఎంఐజి లేఅవుట్ పూర్తయితే రూపురేఖలు మారిపోతాయని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో సుడా అధికారుల ఆధ్వర్యాన మండలంలోని బొడ్డపాడులో నిర్మాణం అవుతున్న ఎంఐజి లేఅవుట్-1లో 240 చదరపు గజాల ప్లాట్లను జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సమక్షంలో ఎమ్మెల్యే బుధవారం డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ ప్లాట్ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఎంఐజి లేఅవుట్-1లో 240 చదరపు గజాల స్థలం రాని వారికి లేఅవుట్-2లో అవకాశం కల్పిస్తున్నారని, ఏ ఒక్కరూ ఆందోళన చెందవద్దని సూచించారు. మరో పది రోజుల్లో ఎంఐజి లేఅవుట్-2లో ఎంపికలు నిర్వహిస్తారని చెప్పారు. ప్రతి లబ్ధిదారుడికీ ఫోన్ ద్వారా సమాచారం ఇస్తారని తెలిపారు. మధ్యాహ్నం 200, 150 చదరపు గజాల ప్లాట్లను డ్రా తీశారు. డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు త్వరలోనే సమాచారం అందించి మిగిలిన ప్రక్రియ నిర్వహిస్తామని సుడా అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సుడా పిఒ అమర్నాథ్, జెపిఒ శాస్త్రి, ఎపిఒ కృష్ణ, ఎసిపి జానకి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మోహన్, వెంకటేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వాటర్ బెల్స్

టెక్కలి : ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి గంటకొకసారి వాటర్ బెల్స్ బుధవారం నుంచి అమలవుతున్నాయి. ఒకటి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వరిస్తుంది. ప్రస్తుతం పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. తరగతి గదుల్లో ఉండే విద్యార్థులు ఎండల తీవ్రత నుంచి తట్టుకునేందుకు వాటర్ బెల్స్ ఉపయోగపడనున్నాయి. ఇందులో భాగంగా ఉదయం పది నుంచి మద్యాహ్నం 12 గంటల వరకు సమయం కేటాయించారు. ఈ సమయంలో గంటకొకసారి చొప్పున్న బెల్ మోగడం, ఆ సమయంలో తరగతి గదిలో ఉండే ఉపాధ్యాయుడు విద్యార్థులతో వాటర్ తాగించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలలు విడిచిపెట్టిన తర్వాత విద్యార్థులు ఎండలో ఇంటికి వెళ్తున్న కారణంగా వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఈ ఏర్పాట్లు చేపట్టారు. పాఠశాలలకు సెలవులు మంజురయ్యే వరకు ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

నవోదయ 2.0పై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయ 2.0పై జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన నిర్వహించారు. బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బూర్జ మండలంలోని జంగాలపాడు, మసానపుట్టి, చిగురువలస, అలాగే ఎల్ఎన్‌పేట మండలంలోని పూశాం, రావిచంద్రి, కోతిగార్లపాడు, గొట్టిపల్లి గ్రామాల్లో నవోదయ 2.0 ప్రచార రథంతో గ్రామాల్లో నాటుసారా వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. నాటుసారాకు ప్రజలు బలి కాకూడదని, నాటుసారా రవాణా, అమ్మకం చట్టరీత్యా నేరమని ప్రజలకు వివరించారు. నాటుసారా తయారీ అమ్మకం చేపట్టే వారిపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న విప్ అశోక్

ఆపదలో ఆదుకునేందుకే సహాయనిధి

ప్రజాశక్తి- కవిటి

ఆపదలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి తోడ్పడుతుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని బెజ్జిపుట్టుగకు చెందిన పొందల విజయరత్నం తీవ్ర అనారోగ్యానికి గురై ఇటీవల వెన్నుపూసకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆమె ఆర్థిక పరిస్థితి తెలిసిన జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు పొందల కృష్ణారావు విషయాన్ని విప్ దృష్టికి తీసుకెళ్లారు. విప్ చొరవతో ఆమెకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.57,348లు మంజూరయ్యాయి. బుధవారం ఉదయం సంబంధిత చెక్కును బాధిత మహిళకు అందించారు. దీనిపై ఆమె స్పందిస్తూ విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పండి దేవేంద్రమూర్తి, పొందల నారాయణమూర్తి, పొందల శ్రీదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అన్వేష్‌కుమార్

ఫాస్టర్ మృతిపై విచారణ చేపట్టాలి

ఇచ్ఛాపురం : ఈ నెల 25న రాజమండ్రి సమీపంలో క్రైస్తవ వక్త ఫాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల వివాదస్పదంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, ఈ మృతిపై క్రైస్తవ సంఘాల నాయకులు అనుమానాల వ్యక్తమవుతున్నాయని ఇచ్ఛాపురం క్రిస్టియన్ మైనారిటీ సంఘ ప్రతినిధి ప్రత్తి అన్వేష్ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరంగా వ్యవహరించి సమగ్ర విచారణ చేపట్టి క్రైస్తవులకు న్యాయం చేయాలన్నారు. ఇటీవల క్రైస్తవులపై జరుగుతున్న దాడులు విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని మత సామరస్యం కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫాస్టర్లు ఏలీయా, భీమో, సుందరరావు పాల్గొన్నారు.

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం హుండీని బుధవారం తెరిచి లెక్కింపు చేపట్టారు. ఆమదాలవలస గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి తమ్మినేని రవి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ సిబ్బంది, పోలీసులు, ప్రజల సమక్షంలో హుండీని తెరిచి లెక్కించగా రెండేళ్ల కాలానికి రూ.33,222 నగదు కానుకల రూపంలో వచ్చినట్లు కార్య నిర్వహణాధికారి టి.రవి తెలిపారు.

గ్లూకోజ్ పంపిణీ

కవిటి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఎండ తీవ్రత దష్ట్యా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద యువకులు శీతల పానీయాలు పంపిణీ చేస్తోంది. అందులో భాగంగా దుక్క బిసాయి జగదీష్ - లక్ష్మణ్ సోదరుల ఆర్థిక సాయంతో బుధవారం 400 మంది విద్యార్థులకు గ్లూకోజ్ పంపిణీ చేశారు.

గ్లూకోజ్ పంపిణీ చేస్తున్న యువకులు

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ అజెండా ఉద్దేశమని కాళింగ కార్పోరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఆమదాలవలస రూరల్, అర్బన్, సరుబుజ్జిలి, బూర్జ మండలాలకు సంబంధించి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, రోడ్లు, కాలువల నిర్మాణానికి 100కు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యాలయ

వినతులు స్వీకరిస్తున్న టిడిపి నాయకులు

సమన్వయ కార్యదర్శి మొదలవలస రమేష్, జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళీ, పివివికె రాజు, నాగళ్ల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాపై కొరడా

ప్రజాశక్తి- పలాస

అక్రమంగా మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. మండలంలోని కేదారిపురం, కంబిరంగా గ్రామాల వద్ద పొలాల్లో మంగళవారం రాత్రి మట్టిని తవ్వుతున్నారు. సమాచారం అందుకున్న తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి ఆధ్వర్యాన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడుల్లో మూడు ట్రిప్పర్లు, ఎక్స్కవేటర్ స్వాధీనం చేసుకున్నారు. వీటి నుంచి రూ.60 వేలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. వారం రోజులుగా ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రులు భారీ వాహనాలతో పంట పొలాల్లో మట్టిని తవ్వుతున్నారు. నిబంధనల మేరకు అడుగు మేర మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండానే మీటర్ల కొద్ది లోతు తవ్వుతు మట్టిని తవ్వుతుండడం సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. వాస్తవానికి సోమవారం అర్ధరాత్రి మట్టి తవ్వుతున్నట్లు ఫిర్యాదులు అందినా సిబ్బంది లేకపోవడంతో దాడులు చేయలేకపోయారు. మంగళవారం పథకం ప్రకారం మాటుకాసి మట్టిని తవ్వుతుండగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అనంతరం వాహనాలను తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. బుధవారం నిబంధల మేరకు అపరాధ రుసం వసూలు చేసి విడిచిపెట్టారు.

డ్రైవర్లతో మాట్లాడుతున్న తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి

గాలికుంటు టీకాలు పరిశీలన

పరిశీలిస్తున్న కరుణాకరరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పశువుల్లో వ్యాధి నిరోధక టీకాలపై పశు పోషకులందరూ అవగాహన కలిగి ఉండాలని పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలో పెద్దపద్మాపురంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ ఈ గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ఒకసారి వ్యాక్సిన్ వేసి మళ్లీ నెల రోజుల తర్వాత బూస్టర్ డోసు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మాలతీ, ప్రతినిధి శ్రీధర్, గ్రామ పెద్దలు లక్ష్మీనారాయణ, పశు వైద్య సిబ్బంది సంపత్, వీరమ్మ, చలపతి, గణపతి, కె.గణపతి పాల్గొన్నారు.

ఆశీలు వేలంపాట వాయిదా

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో సంవత్సర కాలం పట్టణ ఆశీల వసూళ్లతో పాటు కమేళా ఆశీల వసూళ్లకు నిర్వహించిన వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ మేనేజర్ బిషోయ్ ప్రకటించారు. బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో మేనేజర్ బిషోయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు వేలంపాట నిర్వహించారు. పట్టణ పరిధిలో ఆశీల వేలం పాటకు సాల్వెన్స్‌లు పొంది పాల్గొనాల్సిన గుత్తేదారులు ముగ్గురిలో బొడ్డేపల్లి దాలినాయుడు ఒక్కరే హాజరు కావడంతో మధ్యాహ్నం 12

వేలంపాటలో పాల్గొన్న అధికారులు

గంటల వరకు వేచి చూసి మేనేజర్ బిషోయ్ ఆశీల పాటను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మరలా వేలంపాటను నిర్వహించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు, జామి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం వైసిపిదా? టిడిపిదా?

ప్రజాశక్తి-విజయనగరం

నగరాభివృద్ధి తొమ్మిది నెలలుగా కుంటు పడిందా? ఎవరి వలన? దీనికి కారణం పాలకవర్గంలో ఉన్న వైసిపిదా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానిదా?.. పాలకవర్గం చేస్తున్న అభివృద్ధిని టిడిపి నాయకులు అడ్డుకుంటున్నారా?, పాలక వర్గం నిర్ణయాలు అమలు కావడం లేదా? నగర పాలక సంస్థ లో అధికారులు పాలకవర్గానికి సహకరించడం లేదా? ఇలా నగరంలో ఎక్కడ చూసినా చర్చ జరుగుతోంది. ఈనెల 22న జరిగిన నగర పాలక సంస్థ పాలకవర్గ సమావేశంలో పాలకవర్గ సభ్యులు చేసిన వ్యాఖ్యలతో ఈ చర్చకు తెరలేచింది. నగరాభివృద్ధి గత తొమ్మిది నెలలుగా కుంటు పడిందని నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు దారితీశాయి. నగరంలో ఏ పనులు చేసినా అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఖాతాలోకి వెళ్తాయనే భయంతో ఆయన అన్నారా? లేదా రాజకీయ విమర్శ కోసం అన్నారా అనేది పక్కన పెడితే అభివృద్ధి కుంటుపడిందని చేసిన వ్యాఖ్యలు విమర్శలకు తావు ఇచ్చాయి. నగర పాలక సంస్థ పాలకవర్గంలో 50 మందికి గాను 47 మంది కార్పొరేటర్లు వైసిపికి చెందిన వారే ఉన్నారు. పూర్తి స్థాయి అధికారం వైసిపి పాలకవర్గం చేతిలో ఉంది. నగరంలో ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్న, ప్రజలకు ఎటువంటి సేవలు అందించాలన్న తీసుకునే నిర్ణయాధికారం వైసిపి పాలకవర్గానికే ఉంది.

అటువంటిది పాలకవర్గ సభ్యులే ఇటువంటి వ్యాఖ్యలు చేయడం పట్ల పాలకవర్గం అచేతనం బయట పెట్టినట్లు ఉందనే చర్చ సాగుతోంది. కేవలం మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఓటమి కావడంతో నగరాభివృద్ధి కుంటు పడిందా అనే చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే నగర పాలక సంస్థ నిర్ణయాల్లో భాగస్వామ్యం కావడం లేదని చర్చ జరుగుతుంటే అధికార పాలకవర్గంలో కో ఆప్షన్ సభ్యుడు అభివృద్ధి కుంటుపడిందని చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి.

ఆమదాలవలస: మజ్జిగను పంపిణీ చేస్తున్న గీత

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి- ఆమదాలవలస

చలివేంద్రంతో ప్రజలు దాహార్తిని తీర్చుకోవాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ భవన సముదాయాల ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో దాత తమ్మినేని గీత ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో వేడి తీవ్రత దృష్ట్యా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, పాదచారులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ తెలుగు మహిళా అధ్యక్షులు బోయిన సునీత, మాజీ కౌన్సిలర్ గుడ్ల రాజ్యలక్ష్మి, టిడిపి నాయకులు గుడ్ల దుర్గాప్రసాద్, బోయిన బాల, పొట్నూరు శివ తదితరులు పాల్గొన్నారు.

కవిటి: వేసవి తీవ్రత దృష్ట్యా కవిటి బస్టాండ్‌లోని ప్రయాణికుల విశ్రాంత భవనంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికులకు చల్లని నీటిని అందించారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు దృష్టిలో ఉంచుకుని ప్రతి కూడలి, రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇఒ వీరబద్రస్వామి, బెందాళం తిరుమల, ప్రగడ మణిబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో బుధవారం శక్తి యాప్‌పై కాశీబుగ్గ ఎస్ఐ జి.రాజేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్నప్పుడు ఎస్ఒఎస్ ఆన్ చేస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌కి వీడియో వెళ్లి పోలీసులు వస్తారని అన్నారు. ఇది ఆపదలో ఉన్న మహిళలు, పిల్లలకు ఉపయోగకరమన్నారు. డ్రగ్స్, మద్యం, మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, కొయ్యల శ్రీనివాసరావు, సుధాకుమారి, చంద్రశేఖర్, శివప్రసాద్, రజనికుమారి, జ్యోతమ్మ, కృష్ణవేణి, లక్ష్మీబాయి, విష్ణాచారి పాల్గొన్నారు.

వస్త్రపురి కాలనీలో అపారిశుధ్యం

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు గ్రామ పంచాయతీలోనే అపారిశుధ్యం తాండవిస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి కూతవేటు దూరంలోనే ఉన్న వస్త్రపురి కాలనీలో ఎక్కడ చూసినా, ఏవీధిలో చూసినా కాలువల్లో మురుగునీరు కొన్నేళ్లుగా పూడుకుపోయిన పరిస్థితి కనిపిస్తుంది. వీధుల్లో ఇళ్ల ముందు కాలువలు పూడికలతో నిండిపోవడంతో మురుగంతా పోగులుగా ఉంది. దీంతో మురుగునీరు కాలువల్లో వెళ్లేందుకు వీలు లేకపోవడంతో పూడికలతో కాలువలు నిండిపోయి దుర్గంధపు వాసనాతో పాటు దోమలు, ఈగలతో అక్కడి వారంతా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన

కాలువల్లో పూడుకుపోయిన చెత్త

చెందుతున్నారు. తాగునీరు కుళాయిల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉన్నా ఆ కుళాయిల చెంతనే తాగునీరు ఉపయోగించు కుంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించాలని, కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

20 మందికి ఫిజియోథెరపీ

ఇచ్ఛాపురం : స్థానిక భవిత కేంద్రంలో 20 మంది వికలాంగులకు ఫిజియో థెరపిస్ట బి.అమూల్య ఫిజియో థెరపీ బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ-2 ఎస్.విశ్వనాథం పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.శివకుమార్, సహిత ఉపాధ్యాయులు ఎస్.సూర్యం, హెచ్.సోమేష్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిఐ బేబీ

నాటుసారా నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి- సోంపేట

నాటు సారాను సమూలంగా నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని ఎక్సైజ్ సిఐ బేబీ అన్నారు. మండలంలోని బాతుపురం, మాలగోవిందపురం, పైడిగాం, కొరంజిభద్ర గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అవగాహన కల్పించి ప్రజలతో నాటుసారాకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జీడి మామిడి, కొబ్బరి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని బాపట్ల జీడి మామిడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉమా మహేశ్వరి, కీటక శాస్త్ర నిపుణులు డాక్టర్ స్రవంతి అన్నారు. మండలంలోని పాతటెక్కలిలో జీడి మామిడి, కొబ్బరి తోటలను బుధవారం పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా జీడి, కొబ్బరిలో ఉన్న సమస్యలను చీడపీడలను గుర్తించినట్లు తెలిపారు. జీడి, మామిడి తోటల్లో జూన్, జూలై నెలల్లో ఎరువులు యాజమాన్యం గురించి, కొమ్మలు కత్తిరింపులు గురించి వివారించారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖ అధికారి సునీత, సర్పంచ్ సుశీల, రైతులు మల్ల సూర్యం, శివప్రసాద్, హార్టికల్చర్ సహాయకులు ప్రవీణ్, అవినాష్, సంతోష్ పాల్గొన్నారు.